# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

బుధవారం 09 ఏప్రిల్ 2025


## ఒంటిమిట్టకు సీఎం పర్యటన ఖరారు

**రాత్రి ఇక్కడే బస**

**రాజంపేట అర్బన్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త**



రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 11న ఒంటిమిట్టలో జరగనున్న సీతారాముల కల్యాణానికి రానున్నారు. ఈ మేరకు ఆయన పర్యటన ఖరారైంది. 11వ తేదీ ఏలూరు జిల్లాలో పర్యటించిన అనంతరం విజయవాడకు చేరుకుంటారు. గన్నవరం ఎయిర్పోర్ట్ నుంచి కడపకు సాయంత్రం 4.30కి వస్తారు. కడప నుంచి రోడ్డు మార్గంలో ఒంటిమిట్టకు సాయంత్రం ఐదు గంటలకు చేరుకుంటారు. 6.30 గంటలకు కోదండరామస్వామి దర్శించుకుంటారు. అనంతరం ఆయన స్వామికి పట్టు వస్త్రాలు ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తారు. కళ్యాణోత్సవంలో పాల్గొన్న అనంతరం ఒంటిమిట్ట టిటిడి గెస్ట్ హౌస్ లో బస చేస్తారు. 12 తేదీ ఉదయం 8.50 గంటలకు ఒంటిమిట్ట నుంచి కడపకు రోడ్డు మార్గాన బయలుదేరుతారు. 9.20 గంటలకు కడప ఎయిర్పోర్ట్ కు విమానంలో విజయవాడ బయలుదేరుతారు.

## రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ క్రీడలకు నలుగురు ఎంపిక.

**మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ హేమంత్ కుమార్.**

**తంబళ్లపల్లె ఏప్రిల్ 8 ప్రభాతవార్త ః**

ఈనెల 26, 27వ తేదీలలో జరిగే రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ క్రీడలకు తంబళ్లపల్లి మోడల్ స్కూల్ నుండి నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ హేమంత్ కుమార్ తెలిపారు. మదనపల్లెలో ప్రైమ్ స్పోర్ట్స్ అరీనాలో నిర్వహించిన పోటీల్లో మోడల్ స్కూల్ చెందిన అజార్ అహ్మద్, గౌస్ మహమ్మద్ ఎంపిక కాగా బాలికల విభాగంలో కరీమున్నీసా ఎంపికయ్యారు. వీరితోపాటు స్టాండ్ బై గా హర్షవర్ధన్ ఎంపికయ్యారు. షూటింగ్ బాల్ క్రీడలకు ఎంపికైన విద్యార్థులతోపాటు ప్రిన్సిపల్ హేమంత్ కుమార్, పిడి లత లను ఎంఈఓ లు త్యాగరాజు, నాగ సుబ్బరాయుడులను ప్రశంసించారు.



# ప్రతి కార్యకర్త సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తా

**సీఎంకు కుప్పం ఎంతో పులివెందుల అంతే**

**2029లో పులివెందుల సీటును గెలవబోతున్నాం**

**కక్షయపూరిత పాలన వద్దు ప్రజా పాలన చేద్దాం అంటున్న సీఎం**

**175 నియోజక వర్గాలలో జరిగే పనులు అన్ని ఇక్కడ కూడా అమలు**

**త్వరలో జలజీవన్ పనుల ప్రారంభోత్సవాలకు రానున్న లోకేష్**

**ఇన్చార్జి మంత్రి వర్యులు సవితమ్మ**



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్ చార్జ్ మంత్రి సవితమ్మ

**పులివెందుల,ఏప్రిల్8,ప్రభాత వార్త:**

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కుప్పం ఎంతో పులివెందుల కూడా అంతేనని బీసీ సంక్షేమ శాఖ చేనే తజోలీ మంత్రి వర్యులు మరియు వైయస్సార్ కడప జిల్లా ఇన్చార్జ్ మంత్రి సవితమ్మ అన్నారు. పులివెందుల లోని శ్రీకర్ ఫంక్షన్ హాల్ నందు మంగళవారం జరిగిన నియోజకవర్గ స్థాయి తెదేపా కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్రమంతా ఒక ఎత్తైతే పులివెందుల ఒకటి మరో ఎత్తని పులివెందుల తెలుగు దేశం పార్టీ నాయకులు కార్యకర్తలు రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన నాయకునితో పోరాటం చేసి నిలబడ్డారని అన్నారు. ఇప్పటికే పట్టబద్దుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పులివెందులలో రామగోపాల్ రెడ్డికి మెజారిటీ తెచ్చి గెలిపించారని ఈ మధ్య జరిగిన నీటి సంఘాలు ఎన్నికల్లో కూడా తెదేపా జెండా ఎగిరేలా చేశారని 2029 లో రానున్న ఎన్నికల్లో పులివెందుల సీటును కూడా గెలిచి హ్యాట్రిక్ కొట్టబోతున్నా మని అది ఇక్కడి తెలుగుదేశం పార్టీ నాయకుల అభిమానుల కార్యకర్తల చలవ వలనే అన్నారు. 24 గంటలు ఈ నియోజకవర్గ కార్యకర్తలు ఎవరు వచ్చినా అందుబాటులో ఉండి నాకు చేత నయ్యేంతవరకు సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రతి ఇంటిలో కూడా చిన్న చిన్న సమస్యలు ఉంటాయని వాటిని పరిష్కరిస్తామని ఎవరు కూడా ఘర్షణ వాతావరణం పాల్పడవద్దన్నారు. ముఖ్యంగా సీఎం చంద్రబాబు నాయుడు కచ్చ పూరిత పాలన వద్దు ప్రజా పాలన అందిద్దాం అంటున్నారని కక్షయ సాదింపు పనులకు ముఖ్యమంత్రి ఎటువంటి పరిస్థితిలో సహించరన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు తన సొంత నియోజకవర్గం కుప్పం ఎంతనో పులివెందుల కూడా అంతేనని పులివెందులలో కూడా అభివృద్ధి పనులు చేపడుతారన్నారు. ఒక 15 రోజులలో పులివెందులలో జలజీవన్ మిషన్ పనులను మంత్రివర్యులు నారా లోకేష్ ప్రారంభించనున్నారనీ అన్నారు. కార్యకర్తలకు న్యాయం చేస్తామని రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలలో ఏమి అభివృద్ధి పనులు జరుగుతున్నాయో అన్ని అభివృద్ధి పనులు పులివెందులలో కూడా జరుగుతాయన్నారు. పులివెందుల ప్రాంతం నుంచి చాలామంది నాయకులు నా వద్దకు వచ్చారని ఎవరు వచ్చినా కూడా వారి స్వలాభం చూసుకోకుండా పులివెందుల అభివృద్ధికి పనులు చేయించాలని కోరారని ఇలాంటి నాయకులు ఉండడం పులివెందల కార్యకర్తలకు అదృష్టం అన్నారు. 2019 ఎన్నికల్లో వైయస్ జగన్మోహన్ రెడ్డికి 92 వేల పైగా వచ్చిన మెజారిటీని 2024 లో 60 వేలకు తగ్గించారని ఇక ముందున్న లక్ష్యం 2029 ఎన్నికల్లో పులివెందులలో తెదేపా జెండాను ఎగరవేయడమే అన్నారు. ఈ నెలాఖరుకల్లా గ్రామ,మండల, మున్సిపల్, నియోజకవర్గ స్థాయి కమిటీలను పూర్తి చేయాలని అలాగే ఔత్సాహికులను జిల్లా కమిటీలో కూడా తీసుకుంటామన్నారు. రానున్న నెలలో జరిగే 44 వ మహానాడు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు విజయవంతం చేయాలన్నారు. అంతకుము నుపు నియోజక వర్గ ఇన్చార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, కడప జిల్లా పోలీస్ బ్యూరో శ్రీనివాసులు రెడ్డి,పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగో పాల్ రెడ్డి, మండల నాయకులు మోహన్ రెడ్డి విశ్వనాథరెడ్డి సీనియర్ నాయకులు మద్దూరు వెంకటరామిరెడ్డి తదితర నాయకులు కార్యకర్తలు ఉద్దేశించి ప్రసంగించారు. నియోజకవర్గ ఇన్చార్జి బీటెక్ రవి మాట్లాడుతూ ముఖ్యంగా పులివెందుల నియోజకవర్గ కార్యకర్తలు గత వైకాపా పాలనలో ఒడిదుడుకులు ఎదుర్కొని నిలబడ్డారని వారికి మన ప్రభుత్వం ద్వారా పనులు కల్పించి నిలధోక్కునే లా చేయాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు ఎందుకు ఆమె సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు బీటెక్ సోదరుడు భరత్ రెడ్డి, తుంగభద్ర నీటి సంఘ చైర్మన్ జోగిరెడ్డి, పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పార్థసారథి రెడ్డి, షబ్బీర్ అలీ ,ముని రెడ్డి , సంజీవరెడ్డి , బొజ్జా మైసూరా రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కడలిపై తెలియాడి...



గ్రామోత్సవములో కోలాటం కనివిందు వటపత్ర సాయి

**రాజంపేట అర్బన్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త**

ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం ఉదయం వటపత్రశాయి అలంకారంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 7.30 గంటల నుండి స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు.కాగా పురాణాల ప్రకారం జలప్రళయం సంభవించినపుడు శ్రీమహావిష్ణువు మర్రి ఆకుపై తేలియాడుతూ చిన్న శిశువుగా దర్శనమిస్తారు. కుడికాలి బొటనవేలిని నోటిలో పెట్టుకుని ఆస్వాదిస్తుంటారు. ఈ ఘట్టాన్ని గుర్తుచేస్తూ శ్రీమహావిష్ణువు అవతారమైన శ్రీరాముడు భక్తులకు కనువిందు చేశారు. భక్తుల కష్టాలను కడతేర్చేందుకు ఎప్పుడూ ముందుంటానని స్వామివారు ఈ అలంకారం ద్వారా తెలియజేస్తున్నారు. వటపత్రశాయి మహిమను అన్నమయ్య తన సంకీర్తనల్లో చక్కగా వర్ణించారు. వాహనసేవలో ఆలయ డిప్యూటీ ఈవో నటేష్ బాబు, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్స్పెక్టర్ నవీన్, ఆలయ అర్చకులు వీణ రాఘవాచార్యులు, శ్రావణ్ కుమార్, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు ముమ్మరం

**స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించనున్న సీఎం... తితిదే ఈఓ జె.శ్యామల రావు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**





**రాజంపేట అర్బన్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త**

చారిత్రాత్మక ప్రాశస్తం కలిగిన ఒంటిమిట్ట శ్రీ సీతారాముల కళ్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పే ర్కొన్నారు. మంగళవారం ఒంటిమిట్ట టిటిడి కళ్యాణ మండపం పరిపాలన భవన సమావేశ మందిరంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రోగ్రాం కో ఆర్డినేటర్ వెంకటేశ్వర్ రావు, తితిదే ఈఓ జె. శ్యామల రావు, తితిదే జెఈఓ వీరబ్రహ్మం, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ లతో కలిసి శ్రీ కోదండరామస్వామివారి కల్యాణోత్సవ ఏర్పాట్లపై శాఖల వారీగా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 11న శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరుగనుందన్నారు. అశేష భక్తజన సందోహం మధ్య కన్నుల పండుగగా జరిగే ఈ మహోత్సవానికి.. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుటుంబ సమేతంగా హాజరు కానున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్సవంగా ఈ కళ్యాణోత్సవం జరుగుతోందని, అందులో భాగంగా సీతారాముల కల్యాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి సీతారాముల వారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తారన్నారు. అత్యంత ప్రాధాన్యతతో నిర్వహిస్తున్న మహోత్సవంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం లేకుండా జిల్లా అధికారులు, టిటిడి అధికారులు సంయుక్తంగా, సమన్వయంతో పనిచేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. కళ్యాణోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులతో పాటు ప్రముఖులు, అత్యంత ప్రముఖులు రావచ్చనే అంచనాతో అన్ని రకాల ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేయడం జరిగిందన్నారు. ఎక్కడా కూడా ఎటువంటి చిన్న పొరపాట్లకు అవకాశం లేకుండా అన్ని శాఖల అధికారులు వారికి కేటాయించిన విధులను సామర్థవంతంగా పూర్తి చేయాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జిల్లా, టీటీడీ, పోలీస్ అధికారులు సంయుక్తంగా, నిర్దిష్ట ప్రణాళికలతో విధులను నిర్వర్తించాలన్నారు. ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు కావాల్సిన అన్ని రకాల మౌలిక, కనీస వసతులను ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూర్తి చేయాలన్నారు. భద్రతా ఏర్పాట్లు, శానిటేషన్, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు, తాగునీరు, భక్తులకు అన్నప్రసాదాలు, విద్యుత్ సరఫరా, ట్రాఫిక్ కంట్రోల్, ఆర్టీసీ రవాణా సౌకర్యం, సూచిక బోర్డులు ఏర్పాటు, కంట్రోల్ రూం ఏర్పాటు, సీసీ కెమెరాలు, విద్యుత్, అగ్నిమాపక వాహనాలు, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది, 108 వాహనాలు, అత్యవసర మందులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, తాత్కాలిక మెడికల్ క్యాంపులు, అక్కడక్కడ హెల్ప్ డెస్క్ ల ఏర్పాటు మొదలైన అన్ని అంశాలపై జరుగుతున్న ఏర్పట్ల పురోగతిపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. తితిదే ఈవో జె.శ్యామల రావు మాట్లాడుతూ.. టిటిడిలోని అన్ని విభాగాలు, జిల్లా యంత్రాంగం, పోలీసులు సమిష్టి కృషి చేసి ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి కళ్యాణోత్సవాన్ని విజయవంతం చేయడానికి అధికారులను సన్నద్ధము చేయడం జరిగిందన్నారు. ఎలాంటి చిన్న పొరపాటుకు కూడా అవకాశం లేకుండా ఈ ఏడాది కోదండరామస్వామి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు టిటిడి తరపున సంపూర్ణ సహకారాలు అందిస్తున్నామన్నారు.అంతకు మునుపు తితిదే ఈఓ జె. శ్యామల రావు, తితిదే జెఈఓ వీరబ్రహ్మం శ్రీకోదండరామ స్వామి కల్యాణ వేదికను జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పరిశీలించారు. ప్రస్తుతం అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను క్షుణ్ణంగా అపరిశీలించి కల్యాణ వేదిక, గ్యాలరీలు, రోడ్లు, బారికేడ్లు, పార్కింగ్, విద్యుత్, ఇతర క్లినింగ్ వంటి పనులపై అధికారులకు దిశానిర్దేశం చేసి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, కెఎంసి కమీషనర్ మనోజ్ రెడ్డి, టిటిడి డిప్యూటీ ఈవో నటేష్, డిఆర్డీఏ పీడి ఆనంద్ నాయక్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, జిల్లా ఫైర్ అధికారి ధర్మారావు, డిఎంహెచ్ఓ డా.నాగరాజు, డీపీఓ రాజ్యలక్ష్మి, పంచాయతీ రాజ్ ఎస్ఈ శ్రీనివాస్ రెడ్డి, ఏపిఎస్పిడిసిఎల్ ఎస్ఈ రమణయ్య, డిటిసి, ఆర్టీసీ అధికారులు, టిటిడి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మారుమూల గ్రామాలకు ఆర్టీసీ బస్సు

**మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**



**రాయచోటి, ఏప్రిల్ 8ప్రభాత వార్త**

ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చడమే ఆర్టీసీ యొక్క ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని శివాలయం సెంటర్ నందు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి 12 నూతన ఆర్టీసీ బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.... ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చడమే ఆర్టీసీ యొక్క ముఖ్య ఉద్దేశమని రాబోయే రోజులలో ప్రయాణికుల సౌకర్యార్థం మరిన్ని నూతన బస్సులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని 3, సూపర్ డీలక్స్ లు, 2, అల్ట్రా డీలక్స్ లు, 5, ఎక్స్ప్రెస్ లు, 2, పల్లె వెలుగు బస్సులను ప్రారంభించడం జరిగిందన్నారు. గత ఐదేళ్లలో ఏపీఎస్ ఆర్టీసీ పూర్తిగా నిర్వీర్యం అయిందన్నారు. రాబోయే రోజులలో ఏపీఎస్ఆర్టీసీని పూర్తి ప్రక్షాళన చేసి ప్రయాణికులకు నాణ్యమైన రవాణా సేవలు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మన జీవనంలో ఆర్టీసీ బస్సు ఒక భాగమని, ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి మారుమూల గ్రామాలకు కూడా ఆర్టీసీ బస్సులు వెళ్లడం జరుగుతుందన్నారు. రాబోయే నాలుగు సంవత్సరాలలో 2000 ఎలక్ట్రిక్ బస్సులు రోడ్లపైకి తెచ్చి ఆర్టీసీ అభివృద్ధికి మరింత కృషి చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా అన్ని ప్రాంతాలకు ఆర్టీసీ బస్సు సర్వీస్ లు ఏర్పాటు చేయడం ప్రతి ఒక్కరూ గర్వించదగ్గ విషయమన్నారు. వచ్చే రెండు మూడు నెలల్లో మరో 300 ఆర్టీసీ నూతన బస్సులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఆర్టీసీ కార్మికులకు నైట్ అలవెన్స్ మంజూరు చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికులకు ఎటువంటి సమస్య ఉన్న తమ దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవచ్చు అని మంత్రి తెలిపారు. ప్రజల సంక్షేమం కోరే మంచి ప్రభుత్వానికి మీ అందరి ఆశీస్సులు దీవెనలు ఎల్లవేళలా ఉండాలని మంత్రి కోరారు. ఈ సందర్భంగా వేద పండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించిన అనంతరం రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి నూతన బస్సు సర్వీసును జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం బస్సులో కల్పించిన సౌకర్యాలను మంత్రివర్యులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ఆర్టీసీ డిపో మేనేజర్ ధనుంజయ, రీజనల్ మేనేజర్ రాము, మదనపల్లె పీలేరు రాజంపేట డిపో మేనేజర్లు ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు తమ్ముళ్లలో భగ్గుమన్న విభేదాలు

**పులివెందుల,ఏప్రిల్8, ప్రభాత వార్త:**




ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి పై దాడికి యత్నిస్తున్న దృశ్యం

పులివెందుల తెలుగు తమ్ముళ్లలో ఇన్ చార్జ్ మంత్రి సాక్షిగా విభేదాలు భగ్గు మన్నాయి. పార్టీలో ఇరువర్గాల మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి. జిల్లా ఇన్చార్జి ,రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి సవిత సమక్షంలోశాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి పై పార్థ వర్గీయులుదాడికి దిగారు. మంగళవారం స్థానిక శ్రీకర్ ఫంక్షన్ హాల్ నందు టిడిపి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత హాజరయ్యారు. ఈ సమావేశానికి రాంగోపాల్ రెడ్డి కూడా హాజరు కావడంతో సమావేశానికి రాకూడదని వేముల టిడిపి ఇన్చార్జి పార్థసారథి రెడ్డి వర్గీయులు రాంగోపాల్ రెడ్డి పై దాడికి దిగారు. వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, టిడిపి నాయకులు చేస్తున్న పనుల్లో అడ్డు తగులుతున్నాడని పార్థసారధి రెడ్డి వర్గీయులు ఆరోపించారు. మైనింగ్, ఇడుపులపాయలోని ట్రిబుల్ ఐటీ ఉద్యోగాలలో , క్యాంటీంగ్ విషయంలో రాంగోపాల్ రెడ్డి జోక్యం చేసుకుంటున్నారని వారు ఆరోపించారు. మంత్రి సవిత, టిడిపి పోలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసులు రెడ్డి జోక్యం చేసుకోవడంతో గొడవ సద్దుమణిగింది. గత పది రోజుల క్రితం వేముల మండలంలో కాంట్రాక్ట్ విషయంలో పార్థసారధి రెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి వర్గీయుల మధ్య ఘర్షణ జరిగింది. డిఎస్పి మురళి నాయక్ జోక్యంతో ఘర్షణ సద్దుమణిగింది.

## జీవో 30ను పేదలు సద్వినియోగం చేసుకోవాలి

**సబ్ కలెక్టర్ వైఖోమ్ నైదియాదేవి**

**రాజంపేట అర్బన్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త**



రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం జారీ చేసిన జీవో 30ని సద్వినియోగం చేసుకోవాలని రాజంపేటసబ్ కలెక్టర్ వైఖోమ్ నైదియాదేవి కోరారు.మంగళవారం తన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమెమాట్లాడుతూ 150 చదరపు గజాలు ప్రభుత్వ భూమి ఆక్రమించిన , దారిద్ర్య రేఖకు దిగువనున్న వారు క్రమబద్ధీకరించు కోవాలని కోరారు.ఇది పేద బడుగు వర్గాల ప్రజలకు ఎంతో మంచి అవకాశం అన్నారు.2019 ముందు నుంచి వారి ఆధీనంలో వున్నట్లయితే,గతంలో ఎప్పుడూ ప్రభుత్వము నుంచి పొందనట్లయితే అర్హులన్నారు.

## జీవో 30ను పేదలు సద్వినియోగం చేసుకోవాలి



**రాయచోటి, ఏప్రిల్ 8ప్రభాత వార్త**

రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం జారీ చేసిన జీవో 30ని సద్విని యోగం చేసుకోవాలని కోరారు. మంగళవారం తన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ 150 చదరపు గజాలు ప్రభుత్వ భూమి ఆక్రమించిన , దారిద్ర్య రేఖకు దిగువనున్న వారు క్రమబద్ధీకరించు కోవాలని కోరారు. ఇది పేద బడుగు వర్గాల ప్రజలకు ఎంతో మంచి అవకాశం అన్నారు. 2019 ముందు నుంచి వారి ఆధీనంలో వున్నట్లయితే, గతంలో ఎప్పుడూ ప్రభుత్వము నుంచి పొందనట్లయితే అర్హులన్నారు.

## రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు పల్లాతో జగన్ రాజు భేటీ

**రాజంపేట అర్బన్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త**

రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ రావు తోపార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు భేటీ అయ్యారు. కడప పర్యటనకు విచ్చేసి మే నెలలో జరగబోయే మహానాడు వేదిక స్థల పరిశీలన కోసం రాగా కడప నుండి తిరుపతికి వెళుతూ మార్గమధ్యంలో రాజంపేట ఎన్టీఆర్ సర్కిల్ నందు పల్లా రాక సందర్భంగా భారీ ఘన స్వాగతంజగన్ మోహన్ రాజు ఆధ్వర్యంలో స్వాగతంపలికి దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. కొద్ది సేపు పార్టీ పరిస్థితులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్ రాజు, మాజీ సర్పంచ్ కొల్లావారిపల్లి సురేంద్ర, సుండుపల్లి టిడిపి నేత రామస్వామి రెడ్డి, సుబ్రమణ్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.



# కోటి రూపాయలతో నిర్మించిన తారు రోడ్డును ప్రారంభించిన మంత్రి

**చిన్నమండెం, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :**

చిన్నమండెం మండలం, వండాడిగ్రామం, గొర్లముదివీడు క్రాస్ నుండి తూర్పుపల్లి వరకు కోటి రూపాయలతో నిర్మించిన నూతన తారు రోడ్డును మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోనే రాయచోటి నియోజకవర్గాన్ని ఆదర్శంగా అభివృద్ధి చేసి ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక నెరవేర్చడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని రాయచోటి, సంబేపల్లి, గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, చిన్నమండెం ఈ 6, మండలాలకు 450 కోట్ల రూపాయల ఖర్చు చేసి వెలుగిల్లు ప్రాజెక్టు నుంచి నీటి సరఫరా చేసి శాశ్వత మంచినీటి సమస్య పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే అవసరమైన గ్రామాలలో బోర్లు వేసి త్రాగు నీటి సమస్య పరిష్కరించడం జరిగిందన్నారు. గత 15 సంవత్సరాలుగా వైసిపి వాళ్లు ఎమ్మెల్యేగా ఉండి రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి ఎటువంటి అభివృద్ధి చేయలేదని కేవలం తొమ్మిది నెలల కాలంలోనే రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిని వంద నుంచి 150 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. త్వరగా 350 కోట్ల రూపాయలతో హంద్రీనీవా కాలువల ద్వారా ఈ ప్రాంతానికి సాగునీరు అందజేయడం జరుగుతుందన్నారు. రాబోయే రోజులలో ప్రతి గ్రామానికి సిమెంటు రోడ్డు, డ్రైనేజీ కాలువలు, వీధిలైట్లు మంచినీటి సదుపాయం తదితర అన్ని మౌలిక వసతులు కల్పించి రాయచోటి నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ము



ఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో ఎక్కడ కూడా సిమెంట్ రోడ్లు నిర్మించలేదని దీంతో ప్రజలు నడవడానికి కూడా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనేవారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మారుమూల గ్రామాలకు సైతం సిమెంటు రోడ్డు ఏర్పాటు చేసి ప్రజల క్షేమానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మంత్రివర్యులకు వండాడి గ్రామ ప్రజలు గజమాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహించి రిబ్బన్ కట్ చేసి, నూతన తారు రోడ్డును మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

# మిత్ర మండల స్టాకు పాయింటు పరిశీలన



మోడల్ స్కూల్ కిట్లు పరిశీలన

**పీలేరు కె.వి పల్లి ఏప్రిల్ 8 ప్రభాతవార్త.**

రాబోయే 2025,26 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందజేసే డా.సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర స్టూడెంట్ కిట్ ల మండల స్టాకు పాయింటు అయిన ఏ.పి మోడల్ స్కూల్, కే. వి పల్లె ను రాష్ట్ర పరిశీలకులు డా.శ్రీ కె.పెంచలయ్య గారు నేడు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్టాకు పాయింటు నందు గల గదులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసి మండల కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు.విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి ప్రతి విద్యార్థి కి కిట్ అందేలా ముందుగానే సిద్ధం చేసుకోవాలని అన్నారు. ఈ సందర్శన లో అన్నమయ్య జిల్లా పరిశీలకులు యు.వెంకట్రామయ్య, సమగ్ర శిక్ష జి.సి.డి. ఓ. మధుమతి ,మండల విద్యా శాఖాధికారి డి.సుబ్రమణ్యం రెడ్డి , మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.రెడ్డి ప్రదీప్ ,మండల విద్యా శాఖ కార్యాలయ సిబ్బంది, సి ఆర్ పీ లు పాల్గొన్నారు.

# పేదల ఇంటి స్థలాలు రిజిస్ట్రేషన్‌కు అవకాశం



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దారు

**పీలేరు ఏప్రిల్ 8 ప్రభాతవార్త :**

రాష్ట్రంలో గతంలో అమలులో ఉన్న జీవో 225 ను రద్దు చేసి, ప్రభుత్వం తాజాగా జీవో 30 అమలు చేయడంతో పేద వర్గాలకు న్యాయం జరుగనుందని పీలేరు తహశీల్దారు భీమేశ్వరరావు తెలిపారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవో 30 అమలుతో 2019 సంవత్సరానికి ముందు మోల్డింగ్ వరకు ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారులు వారి వద్ద ఇంటి పర్మిట్, కరెంట్ బిల్లు, పంచాయతీ రికార్డులు వంటివి ఉంటే వారు తమ స్థలాలను ప్రభుత్వం ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం పొందుతారన్నారు. అయితే, ఇందుకోసం లబ్ధిదారులు ప్రభుత్వానికి మార్కెట్ విలువ ఆధారంగా చలానా కట్టించాల్సి ఉంటుందని చెప్పారు. గతంలో 225 జీవో కింద అమలవుతున్న పాత పథకాలన్నీ రద్దు చేయబడ్డాయని. ఇప్పుడు 30 జీవో ప్రకారం ఏ పేదవారు అయినా తమ స్థలంపై ఇంటిని నిర్మించి, అవసరమైన ఆధారాలుతో నమోదు చేసుకుంటే ప్రభుత్వం వారిని చట్టబద్ధంగా గుర్తించి రిజిస్ట్రేషన్ చేసి ఇస్తుందని తెలియజేశారు. ప్రభుత్వం ఈ పథకం పేదల కోసం ప్రత్యేకంగా ప్రవేశపెట్టిందని, ప్రతి ఒక్కరు తమ ఆధారాలను సక్రమంగా సమర్పించి ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్లు చంద్ర, సుబ్రహ్మణ్యం, వీఆర్వోలు, సర్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 14 తుది గడువు : హౌసింగ్ ఏ ఈ

**సుండుపల్లి,ఏప్రిల్ 8,ప్రభాతవార్త:**

సుండుపల్లి మండలంలోని పి ఎం ఏ వై 2.0 పథకం కింద గృహ నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులందరూ ఈ నెల 14 తేదీలోపు ఇంటికి సంబంధించిన పత్రాలను అందజేయాలని హౌసింగ్ ఏఈ నాగరాజ నాయక్ మంగళవారం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా 1277 మందికి సంబంధించిన దరఖాస్తులను ఇంటి నిర్మాణాల కోసం ఆన్లైన్లో అప్లోడ్ చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపుతామన్నారు. లబ్ధిదారులు ఎవరు పేరిట ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నారో అలాంటి వారందరూ ఇంటి పట్టా, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంక్ అకౌంట్,క్యాస్ట్ సర్టిఫికేట్ ఇన్కమ్ సర్టిఫికెట్ జిరాక్స్ పత్రాలను ఈనెల 14 తేదీలోగా గ్రామ సచివాలయం, మండల కేంద్రంలోని హౌసింగ్ కార్యాలయంలో అందజేయాల్సిందిగా ఆయన తెలియజేశారు.

# దరఖాస్తులు చేసుకోండి

**లక్కిరెడ్డిపల్లి : ఏప్రిల్ 08 ప్రభాతవార్త**

ఎలాంటి ఆధారం లేని నిరుపేదలు అసైన్మెంట్ భూములు పక్కా గృహాలు, ఇంటి స్థలాలకు దరఖాస్తులు చేసుకోవచ్చని ప్రభుత్వ ఆదేశాలు జారీ చేసిందని తాసిల్దార్ శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు గతంలో స్థలం లేకుండా ప్రభుత్వ స్థలంలో ఆక్రమణ చేసుకొని వీళ్ళు నిర్మించుకున్న వారికి ప్రభుత్వము ఆక్రమాలు క్రమబద్ధీకరించడం జరుగుతుందన్నారు అలాగే ప్రభుత్వ భూమిపై నివాస యూనిట్లు ద్వారా అరాధికార ఆక్రమణ క్రమబద్ధీకరించే పథకాన్ని ప్రభుత్వం జీవో నెంబర్ 30 జనవరి 2025న జారీ చేసిందని నిరా అభ్యంతర ప్రభుత్వ భూములు ఆక్రములను క్రమబద్ధీకరించడం చేస్తుందన్నారు అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో నివాస యూనిట్లు ద్వారా అనుమతి లేని ఆక్రమణలు నిరుపేదల సజీవనం చేసుకోవచ్చని 2019లో జీవో విడుదల చేసిందన్నారు కుటుంబంలో మహిళలకు మాత్రమే ఈ పథకాలు వర్తిస్తాయి అన్నారు లబ్బిదారుడు కేంద్ర ప్రభుత్వం మనబడి ఏ గృహ నిర్మాణ పథకంలోను లబ్ధి పొందకూడదు అన్నారు నివసించే వారికి సంవత్సర ఆదాయం లక్ష రూపాయలు పట్టణ ప్రాంతాల నివసించే వారికి లక్ష 44000 బీపీఎల్ కుటుంబం గా పరిగణించబడతాయని ఇటువంటి వారు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు ఈ అవకాశాన్ని నిరుపేదలు ఆయా గ్రామ సచివాలయంలో దరఖాస్తులు చేసుకోవచ్చున్నారు.

# 8మంది జూదరులు అరెస్ట్

**దువ్వూరు, ఏప్రిల్ 08, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని కాగనదూరు గ్రామ సమీపంలో జూదం ఆడుతున్నారని సమాచారం రావడంతో దాడులు నిర్వహించి 8మంది జూదరులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. ముందుగా రాబడిన సమాచారం మేరకు కానగూడూరు సమీపంలోని కుందూనది పరివాహక ప్రాంతంలో జూదం ఆడుతుండగా సిబ్బందిచే దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడులలో కానగూడూరు, కృష్ణంపల్లె, జిల్లెల్ల గ్రామాలకు చెందిన 8మందిని అదుపులోకి తీసుకొని 17210రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. వారిని త్వరలో మైదుకూరు కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

# వడదెబ్బ ప్రాణాంతకం

**పీలేరు కె.వి పల్లి ఏప్రిల్ 8 ప్రభాతవార్త :**

వడదెబ్బకు గురైన వారికి సకాలంలో చికిత్స అందకపోతే ప్రాణం పోయే ప్రమాదం కలదని గర్నిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ రేష్మ హెచ్చరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆషా కార్యకర్తల సమావేశంలో వడదెబ్బ పై వివరించి గ్రామాల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ముఖ్యంగా గ్రామస్తులకు ఉదయం పది గంటల లోపు, సాయంకాలం నాలుగు గంటల తర్వాత పనులు చక్కదిద్దుకొనేలా తెలియజేయాలని, తల వేడిమికి గురికాకుండా రుమాలు లేదా టోపి ధరించాలన్నారు. గొడుగు వాడకం పై అవగాహన కల్పించాలని, తెల్లని లేదా లేత రంగు కాటన్ దుస్తులు ధరించాలని, రోజుకు కనీసం 15 గ్లాసుల నీరు త్రాగాలని తెలిపారు.వడదెబ్బ లక్షణాలు వివరించి ప్రథమ చికిత్స పై అవగాహన పెంచాలని, ఓ.ఆర్.ఎస్. ఆవశ్యకతను తెలిపి సరైన పద్ధతిలో ద్రావణం తయారుచేసుకొనే విధానాన్ని ప్రజలకు నేర్పించాలని ఆదేశించారు. వడదెబ్బకు గురైన వారికి ప్రథమ చికిత్స అందజేసి 108 వాహనం ద్వార వీలైనంత త్వరగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యురాలు డాక్టర్ అర్చన, పర్యవేక్షకులు రుక్మిణి, పురుషోత్తం మరియు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలి

**పెండ్లిమర్రి, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:**



రాష్ట్రంలో గత 19 సంవత్సరాల క్రితం ఎలాంటి విద్యార్హత, వయసుతో సంబంధం లేకుండా ఆశాలుగా నియమించబడి గ్రామాల్లో పట్టణాల్లో గర్భవతులకు, బాలింతలకు, నవజాత శిశువులకు వైద్య సేవలు అందిస్తున్న ఆశా కార్యకర్తలకు ఎలాంటి వేతనాలు పెంపు కానీ, సెలవులు కానీ, ఉద్యోగ భద్రత కానీ, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కానీ కనీసం కార్మికులుగా గుర్తింపు లేకుండా పని చేస్తున్నారని ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీల జీవోలను విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు పి.చంద్రశేఖర్, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.కల్పనలు డిమాండ్ చేశారు. రోజు రోజకు ఆశాలకు పని భారం పెరుగుతోంది తప్ప గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కరోనా-19 కష్టకాలంలో ప్రాణాలను పణంగా పెట్టి పనిచేసిన ఆశాలకు కరోనా సమయంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అలవెన్సు రూ.6వేలు ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఆశా కార్యకర్తలకు రిటైర్‌మెంట్ వయసు 62 సంవత్సరాలకు పెంచడం 180 రోజులు మెటర్నటీ సెలవులు, గ్రాడ్యుటీ రూ.1.50లక్షలు ప్రకటించడం జరిగిందని తక్షణం ఆశా కార్యకర్తల న్యాయమైన సమస్యల పరిష్కారానికి రాష్ట్ర సీఎం చొరవ చూపాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ సీనియర్ నాయకులు పార్వతీ, చంద్రావతి, నాగరత్న, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలని వినతి

**పెండ్లిమర్రి, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:**



మండలంలోని పీహెచ్‌సీ పరిధిలో గల సచివాలయ ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలని మండల అభివృద్ధి అధికారికి మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలో విధులతో పాటు పీహెచ్‌సీ పరిధిలోని మెడికల్ ఆఫీసర్, సీహెచ్‌ఓ, సూపర్‌వైజర్లు, ఫార్మాసిస్టులు కూడా పని ఒత్తిడి చేస్తూ సెలవు దినాల్లో కూడా మాతో పని చేయిస్తున్నారని అలాగే పలు రకాల పనులతో మానసికంగా ఇబ్బందులకు గురవుతున్నామని తమ సమస్యలు పరిష్కరించాలని వారు వేడుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో కమాల్‌బీ, రోజా, సనం, లక్ష్మీ చైతన్య, ఎస్ఎంబీ బేగం తదితరులు పాల్గొన్నారు.

# నీటి తొట్లు ఏర్పాటు

**పెండ్లిమర్రి, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:**



పెండ్లిమర్రి మండలం చెర్లోపల్లి గ్రామ పంచాయతీ, వెయ్యి నూతల కోనలో ఏర్పాటు చేస్తున్న నీటి తొట్లను చెర్లోపల్లె సర్పంచ్ సంగటి గంగిరెడ్డితో కలిసి పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ శారమ్మ, డిప్యూటీ డైరెక్టర్ రమణయ్యలు పరిశీలించారు. అలాగే పెండ్లిమర్రి, నందిమండలం పశువైద్యాధికారులు పరిశీలించారు. ఈ తొట్లు వేసవి కాలంలో పశువులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని నాణ్యతకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని నాణ్యతగా నిర్మించాలని వారు కోరారు. నాణ్యతను చూసి సంతృప్తి వ్యక్తం చేయడం జరిగింది.

# అంకిత భావంతో ఆశ వర్కర్లు పనిచేయాలి..

**ఖాజీపేట, ఏప్రిల్ 08, ప్రభాతవార్త:**



ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు మంగళవారం నాడు డాక్టర్ ఆయేషా సుల్తాన ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఏఎన్ఎం, ఆశలకు స్టాప్ డయేరియా ప్రోగ్రామ్ గురించి, పోషన్ పక్వవాడల గురించి డాక్టర్ ఆయేషా సుల్తానా వివరించారు. వైద్యాధికారి, ఆరోగ్య విస్తరణ అధికారి బి.నాగభూషణం మాట్లాడుతూ ఆశ కార్యకర్తలు అంకిత భావంతో పనిచేయాలని రానున్న వేసవిలో జాతరలు, తిరునాళులు ఎక్కువగా జరుగుతుంటాయని వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఆశ నోడల్ ఆఫీసర్ ఈ.అరుణ కుమారి, హెల్త్ సూపర్‌వైజర్ ఏ.శోభన్ బాబు, ఆశ కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ

**గాలివీడు, ఏప్రిల్ 8(ప్రభాతవార్త):**



గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అభ్యంతరం లేని ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరిస్తున్నట్లు తహసీల్దార భాగ్యలత తెలిపారు. జీఓ నెంబర్ 30ను అనుసరించి ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం 2025 ప్రకారం క్రమబద్ధీకరణ పట్టాలను మహిళల పేరుపైనే జారీ చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2019 అక్టోబర్ 15ను కటాఫ్ డేట్‌గా తీసుకుని ఆ తేదీ కంటే ముందు ఆక్రమించిన వారికే నిబంధనలు అనుసరించి భూముల్ని క్రమబద్ధీకరిస్తామన్నారు. 150 గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరణ చేస్తామని, కాకపోతే లబ్ధిదారుల కుటుంబసభ్యులుఐటీ చెల్లింపుదారై ఉండకూడదు, కుటుంబంలో ఎవరి పేరుపైనా భూములు ఉండకూడదు. నాలుగు చక్రాల వాహనం ఉంటే అనర్హులన్నారు. అయితే వ్యవసాయ పనులకు ఉపయోగించే ట్రాక్టర్లు, టాక్సీ, ఆటోలకు మాత్రం మినహాయింపు ఉంటుందన్నారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం 151-300, 301-450, 451 గజాలకు పైన ఇంటి నిర్మాణాన్ని బట్టి దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేదలు, ఎగువున ఉన్న వారి రిజిస్ట్రేషన్ బేసిక్ విలువలో, రిజిస్ట్రేషన ఫీజు లో 50 శాతం చెల్లించాల్సి ఉంటుందన్నారు. అలాగే ఖాళీ స్థలాలు, వాటిలో తాత్కాలిక ఇళ్లు కట్టుకున్నా క్రమబద్ధీకరణకు అనర్హులని ఉత్తర్వులో పేర్కొన్నారు. గ్రామాల్లో నెలకు 10, 000, పట్టణాల్లో నెలకు రూ.14 వేలు ఆదాయం ఉన్న వారు దీనికి అర్హులు అన్నారు. నెలకు రూ.300లోగా విద్యుత్ చార్జీలు చెల్లింపు ఉండాలి. మెట్ట, మాగాణి కింద కలిపి 10 ఎకరాలకు మించకూడదు. ఆర్‌సీసీ రూఫ్/ఆస్‌బెస్టాస్ రూఫ్‌ను ఇటుక గోడలతో నిర్మించి ఉండాలి. క్రమబద్ధీకరణకు రిజిస్టర్డ్ డాక్యుమెంట్, ఆస్తి పన్ను చెల్లింపు, విద్యుత్ బిల్లు, వాటర్ బిల్లులను పరిగణనలోకి తీసుకుంటామన్నారు.

# కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమిద్దాం

## ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంభశివ



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

**మదనపల్లె, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :**

మేడే పోరాట స్ఫూర్తితో కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక కార్పోరేట్ విధానాలపై ఉద్యమిద్దామని ఏఐటి యుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబ శివ తెలిపారు. మంగళవారం స్థానిక ఏఐటియుసి కార్యాలయంలో నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ 8గంటల పనిదినాల కోసం పోరాడి సాధించుకొన్న నేడు కార్మిక ఓట్లతో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం గంటలను పెంచి కార్మిక శ్రమను దోచ కోవడమే ధ్యేయంగా పరిపాలన చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నింటిని కార్పోరేట్ శక్తులకు కట్టబెడుతూ వ్యవసాయ సహకార రంగాలను కూడా అప్పగించడానికి కుట్రలు చేస్తోందని విమర్శించారు. రోజు రోజుకు పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించడంలో బిజెపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలిపారు. పెట్రోల్, డీజల్‌లకు ఎక్సైజ్ సుంకం కూడా తగ్గించాలని, పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే 20న దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మను జిల్లాలో విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి ముభారక్, పట్టణ కార్యదర్శి తిరుమల, సాబ్‌జాన్, తదితరులు పాల్గొన్నారు.

# వక్ఫ్ బిల్లుకు మద్దతిచ్చి ద్రోహలయ్యారు

## నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు రెడ్డిసాహెబ్



సమావేశంలో ప్రసంగిస్తున్న రెడ్డిసాహెబ్

**మదనపల్లె, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :**

ముస్లింలకు దెబ్బ తీసే వక్ఫ్‌చట్ట సవరణ బిల్లుకు రాష్ట్రం లోని టిడిపి, జనసేన, వైసిపి పార్టీలు మద్దతు ఇచ్చి ముస్లిం ద్రోహులుగా మిగిలిపోయారని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్.రెడ్డిసాహెబ్ విమర్శించారు. మంగళవారం వీసికే పార్టీ నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్.రెడ్డిసాహెబ్‌మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపిపై రాష్ట్రం లోని ప్రాంతాయ పార్టీల తీరుపై మండిపడ్డారు. ముస్లింలకు అన్యాయం చేసే బిల్లుకు మద్దతు ఇచ్చి ముస్లిం సమాజ ద్రోహులుగా మిగిలిపోయారన్నారు. వక్ఫ్‌బిల్లు లోక్‌సభలో ప్రవేశపెడుతున్న సమయంలో కేంద్రంలోని కూటమి ప్రభుత్వంలో భాఘస్వామ్యులైన వివిధ పార్టీల నాయకులు పలు రకాలుగా అవాస్తవాలు ప్రచారం చేశారన్నారు. బిజెపి బిల్లు పాస్ చేసుకోవడానికి అర్ధ రాత్రి వరకు చర్చలు పెట్టి, వ్యతిరేకించే వారు లేనిసమయంలో పాస్ చేసు కోవడం దారుణమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇండియా కూటమి కొన్ని పార్టీలు మాత్రమే వక్ఫ్ సవరణ బిల్లు వ్యతిరేకించాయని తెలిపారు. కేంద్రంలో బి జెపి, రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలకు భవిష్యత్తులో గుణపాఠం చెప్పక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాస్ వ్యవస్థాపకులు పిటిఎం శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# నిమ్మనపల్లె మండల విద్యుత్ ఏఈగా నాగరాజ



ఏఈని సన్మానిస్తున్న దృశ్యం

**నిమ్మనపల్లె, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :**

నిమ్మనపల్లె మండలానికి విద్యుత్ ఏఈగా పి.నాగరాజు మంగళవారం పదవీబాధ్యతలు చేపట్టారు. ఇతను తిరుపతి జిల్లా టెక్కలి మండలం నుంచి నిమ్మనపల్లెకు నూతనంగా విచ్చేశారు. ఈ సందర్భంగా మండలంలోని విద్యుత్ సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలుకుతూ ఘనంగా సన్మానించారు. కాగా నూతనంగా ఇటీవల నిమ్మనపల్లె లైన్‌మెన్‌గా పూర్ణిమకుమార్ బాధ్యతలు చేపట్టగా ఇతను మదనపల్లె మండలం దండువారిపల్లె నుంచి నిమ్మనపల్లెలో బాధ్యతలు చేపట్టారు.

# పట్టణంలో తప్పిన పెను ప్రమాదం

**బద్వేల్ అర్బన్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త**

బద్వేలు పట్టణానికి మంగళవారం ఓ భారీ వాహనం రావడంతో విద్యుత్ వైర్లు తెగి డ్యామేజ్ అయ్యాయి. అయితే ఎలాంటి ప్రమాదం సంభవించకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ ఏఈ శివకుమార్ వెంటనే అక్కడికి చేరుకొని డ్యామేజీ అయినా సర్వీస్ వైర్ కు మరమ్మతులు చేపట్టడంతో ప్రమాదం తప్పింది. విద్యుత్ వినియోగదారులు ప్రతి ఒక్కరు కూడా నాణ్యతగా ఉన్న విద్యుత్ వైర్లను వాడుకోవాలని అలా కాకుండా నిర్లక్ష్యం వహించి నాణ్యతలేని వైర్లను వాడడం వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. భారీ వాహనాలు వచ్చినప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని ఏఈ శివకుమార్ పలువురికి తెలిపారు. సకాలంలో విద్యుత్ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని డ్యామేజ్ అయిన సర్వీస్ వైర్లను తొలగించారు. వెంటనే కొంత సేపు ట్రాఫిక్ జామ్ అయింది. అనంతరం వాహనాలను యధావిధిగా వెళ్లి



# అర్హతను బట్టి న్యాయం చేస్తాం



**గోపవరం, ఏప్రిల్ 8, ప్రభాతవార్త**

అర్హతను బట్టి గుడిశవాసులకు న్యాయం చేస్తామని ఆర్డిఓ చంద్రమోహన్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన గోపవరం మండలంలోని ప్రభుత్వ స్థలంలో అర్హత లేకుండా వేసిన గుడిసె లు మరియు ఇతర నిర్మాణాలను ఆయన బద్వేలు గోపవరం తహసిల్దార్లతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అక్కడి గుడిసె వాసులు తమకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని విన్నవించుకున్నారు ఎందుకు స్పందించిన ఆర్డీవో బుధ గురువారాలలో మీ రేషన్ కార్డులను, అందులోనే కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులను గోపవరం తహసిల్దార్ కు ఇచ్చినట్లయితే ఆయన పరిశీలించి సర్వే నిర్వహించిన అనంతరం అర్హులకు న్యాయం చేయడం జరుగుతుందని హామీ ఇచ్చారు.

# స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మృతికి రెవెన్యూ సిబ్బంది నివాళి



**కలికిరి, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:**

పీలేరు హెచ్ఎన్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఇటీవల సంబేపల్లె మండలం ఎర్రగుంట్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. మంగళవారం మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ ఆదేశాల మేరకు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మహేశ్వరీభాయ్, రెవెన్యూ సిబ్బంది మౌనం పాటించి నివాళి అర్పించి 2 నిమిషాలు మౌనం పాటించి తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా మహేశ్వరీభాయ్ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా రెవెన్యూ శాఖలో విధులు నిర్వహించి ప్రజలకు సేవలు అందించి రోడ్డు ప్రమాదంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సోమవారం మృతి చెందడం బాధాకరమన్నారు. రమాదేవి కుటుంబ సభ్యులకు ఆదేవుడు మనోధైర్యం ఇచ్చి వారిని ఆదుకోవాలని తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నవీన్, వీఆర్వోలు సురేష్‌కుమార్‌రెడ్డి, ఆదిలక్ష్మి, శ్రీనివాసులు, జూనియర్ అసిస్టెంట్ గిరి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులు పరిశీలన



**దువ్వూరు, ఏప్రిల్ 08, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని ఐ.బయనపల్లె గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ రామకృష్ణ, ఏపీఓ లక్ష్మి నారాయణలు మంగళవారం పరిశీలించారు. అలాగే ఉపాధి హామీ నిధుల ద్వారా పశువులకు నీరు అందించేందుకు ఏర్పాటుచేస్తున్న నీటి తొట్టుల నిర్మాణాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో పశువుల నీటికి ఇబ్బంది పడకుండా ఉండేందుకు గాను మండలంలో 13నీటి తొట్టులు మంజూరు అయ్యాయని ఒకొక్క తొట్టికి 30వేల రూపాయలు అందజేస్తున్నామన్నారు. వీటి ద్వారా ఈ తొట్టులలో నీరు నింపితే పశువులు వచ్చి నీటిని తాగే విధంగా ఏర్పాటుచేస్తున్నామన్నారు. ఉపాధి హామీలో కూలీల సంఖ్యను పెంచాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

# 12 నుంచి ఉశేన్‌వల్లి ఉరుసు ఉత్సవాలు




**దువ్వూరు, ఏప్రిల్ 08, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని కడప-కర్నూల్ జాతీయ రహదారి పక్కన మీర్జఖాన్ పల్లె వద్ద వెలసి ఉన్న శ్రీ నెమళ్లదిన్నె ఉశేన్ వల్లి స్వామి వారు ఉరుసు ఉత్సవాలు ఈనెల 12, 13వ తేదీలలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 12వ తేదిన గంధం, 13వ తేదిన జెండా కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా 12న గంధం రోజున బుక్కాయిపల్లె బృందం వారిచే కోలాటం, అన్నమాచార్య కళాపీఠం వారిచే పాటకచ్చేరి ఉంటుందన్నారు. అలాగే 13వ తేదిన జెండా రోజున బండలాగుడు పోటీలు ఉంటాయని, అలాగే బాల నాగమ్మ నాటకం ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. ఉరుసు ఉత్సవాల సంధర్భంగా 13వ తేదిన ఆదివారం బండలాగుడు పోటీలు నిర్వహిస్తామని ఈ పోటీలలో గెలుపొందిన ఎద్దులకు వరుసగా 50వేలు, 40వేలు, 20వేలు, 30వేలు, 20, 10వేలు బహుమతులు అందజేస్తామన్నారు. ఉరుసు ఉత్సవాల సంధర్భంగా 12, 13వ తేదీలలో అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటుచేశామని ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# చింతచిగురు వచ్చిందోచ్

**రామసముద్రం, ఏప్రిల్ 8 ప్రభాతవార్త**



మండలంలోని చింతచెట్లు చిగురు వేశాయి. వేసవిలో ఈ చిగురుతో పప్పు, చెట్ని, చింతచిగురు అన్నం వండి తింటున్నారు. పల్లెలతో పాటు పట్టణాలలో ఈ చిగురు పప్పుతో వేడివేడి సంగటి చేసుకుని రుచికరంగా తింటున్నారు. పల్లె ప్రాంతాలలో ఉన్న చింతచిగురును కోసి పట్టణాలకు తీసుకువచ్చి అమ్ముతున్నారు. రామసముద్రం మండలంలోని బస్సుస్టాప్ వద్ద, వారపుసంత తదితర ప్రాంతాలలో ఈ చిగురును అమ్ముతున్నారు. ఈనెలాకరు వరకు ఈ చిగురు అందుబాటులో ఉంటుంది.

# ప్రొద్దుటూరు మార్కెట్ యార్డ్ చైర్మన్గా వద్ది బాలుడు

**ప్రొద్దుటూరు అర్బన్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :**

ప్రొద్దుటూరు మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా టిడిపి నాయకుడు, మాజీ కౌన్సిలర్ వద్ది బాలుడు త్వరలో ప్రమాణ స్వీకారం చేస్తారని ప్రకటించిన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజు రెడ్డి మంగళవారం ప్రకటించారు. ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశానికి హాజరైన జిల్లా కలెక్టర్ సమావేశం ముగించుకుని వెళ్లిన తర్వాత వద్ది బాలుడును మార్కెట్ యార్డ్ చైర్మన్ గా ఎమ్మెల్యే నంద్యాల వరదరాజు రెడ్డి మీడియా ముఖంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నంద్యాల వరదరాజు రెడ్డికి , మాజీ కౌన్సిలర్ వద్ది బాలుడికి , టిడిపి నాయకులు బద్వేలు శ్రీనివాసులు రెడ్డికి మాజీ కౌన్సిలర్ తలారి పుల్లయ్య భారీ గజమాలవేసి సన్మానించారు.


# దళితుల ఆశాజ్యోతి ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి

**పీలేరు ఏప్రిల్ 8 ప్రభాతవార్త :**

తమను నమ్ముకున్న కుటుంబాలకు ఎటువంటి హాని చేయకుండా వారికి అన్ని విధాల సహకరించి అన్ని పదవులలో పట్టంకటే కుటుంబంలో నల్లారి కుటుంబం కూడా ఒకటి ఉందని అందరికీ తెలిసిందే అదే కోవలో కలికిరి మండలం కలికిరి పట్టణం నడిబొడ్డు ఉన్న గిరిజన కాలనీ నల్లారి కుటుంబానికి కూడా అన్ని విధాల తోడ్పాటు అందించడం తోపాటు వారికి వెనువెంటే నడుస్తుందటంలో కూడా ఎటువంటి అనుమానాలకు తావులేదు, ఇది గ్రహించిన నల్లారి కుటుంబం గత 50 సంవత్సరాలుగా ఆ కుటుంబాలకు కావలసిన మౌలిక సదుపాయాలతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో ప్రాధాన్యత కల్పిస్తూ ముందుకు వెళుతుంది. గత 25 సంవత్సరాలుగా గిరిజన కాలనీలో ఉన్న ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అనునిత్యం గిరిజన బిడ్డలు ఎరుకల కుటుంబాలకు చేయూతనందిస్తూ వివిధ రకాల పదవులలో అనుభవిస్తూ సంక్షేమ కార్యక్రమాలలో పాల్గొంటూ నల్లారి కుటుంబాలకు గిరిజన కాలనీవాసులకు మధ్య వారిదిలా పనిచేస్తున్న శ్రీనివాస్ వర్మకు కలికిరి వ్యవసాయ మార్కెట్ కమిటీలు స్థానం కల్పించి రెండు దఫాలుగా మార్కెట్ కమిటీ డైరెక్టర్గా బాధ్యతలు అప్పజెప్పడం పట్ల నల్లారి కుటుంబానికి కృతజ్ఞతలు తెలియజేశారు ఈ సందర్భంగా శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ తమ కుటుంబాలు ఎంతో మరుగునపడి అభివృద్ధికి నోచుకోక ఉన్న రోజులలో కూడా కలికిరిలోనే కాకుండా పీలేరు నియోజకవర్గం పూర్వ వాయల్పాడు నియోజకవర్గం వారి అండతోనే తమ కుటుంబాలు పదవుల అనుభవించామని గతంలో కూడా నల్లారి సోదరులు మార్కెట్ కమిటీలు డైరెక్టర్గా పదవి కట్టబెట్టారని అవినీతికి తావు లేకుండా సిద్ధ శుద్ధితో పని చేయడం వల్ల తమను నమ్ముకున్న వారికి న్యాయం చేయాలని భావించి పీలేరు శాసనసభ్యులు నల్లారి కిషన్ కుమార్ రెడ్డి రెండో విడత కలిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీలు స్థానం కల్పించడం పట్ల ఆయన పట్ల కృతజ్ఞతతో పాటు పూర్తిగా విధేయుడనై ప్రాణమున్నంతవరకు వారితోనే గడుపుతానని శ్రీనివాస వర్మ తెలిపారు.

**దళితుల ఆశాజ్యోతి ఎమ్మెల్యే**

దళితుల అభివృద్ధికి ఆశాజ్యోతిలా తోడ్పాటు అందించే ఏకైక వ్యక్తి నల్లారి కిషన్ కుమార్ రెడ్డి అని ఆయన శాసనసభ్యులుగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం మొట్టమొదటిగా ఏర్పాటైన కమిటీలలో దళితులలో అన్ని కులాలు మాల మాదిగ ఎరుకల కులాలకు మార్కెట్ కమిటీలు చైర్మన్గా మాలల కులానికి చెందిన మాలతిని డైరెక్టర్లుగా మాదిగ కులానికి చెందిన రాంబాబును ఎరుకల కులానికి చెందిన శ్రీనివాస వర్మాను ఎన్నుకోవడం పట్ల ఆయనపై కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు రాంబాబు తెలిపారు.



ఎమ్మెల్యేతో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రాంబాబు శ్రీనివాస వర్మ

## జాంబవంతుడు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

**(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త)**



ఒంటిమిట్ట చెరువులో జాంబవంతుడు విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు టీటీడీ అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతుగుంట రమేష్ నాయుడు తెలిపారు. మంగళవారం ఆయన ఒంటిమిట్ట రామాలయాన్ని సందర్శించి రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఒంటిమిట్టకు విచ్చేస్తున్న భక్తులకు టిటిడి కల్పించిన వసతులను, అన్నప్రసాదాల ను పరిశీలించి భక్తులకు స్వయంగా అన్న ప్రసాదాలను వడ్డించారు. ఈ సందర్భంగా రమేష్ నాయుడు మాట్లాడుతూ ఒంటిమిట్ట చెరువుకు నీటిని నింపేందుకు కోట్ల రూపాయలతో శ్రీ కోదండరామ ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేసినప్పటికీ ఒక సంవత్సరం కూడా పూర్తిస్థాయిలో చెరువుకు నీరు నింప లేకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఓబిసి మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టుపోగుల ఆదినారాయణ, ఒంటిమిట్ట చెరువు నీటి సంఘం అధ్యక్షులు పాటూరి గంగిరెడ్డి బిజెపి మండల మాజీ అధ్యక్షులు బాలరాజు శివరాజు తదితరులు పాల్గొన్నారు.

## మలేరియా, నోటి శుభ్రతపై అవగాహన సదస్సు

**సుండుపల్లి, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:**



మండల పరిధిలోని రాయవరం పీహెచ్సి నందు జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి, డెంటల్ డాక్టర్ ఖదీర్ బాష ఆశా కార్యకర్తలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా మలేరియా అధికారి రామచంద్ర రెడ్డీ మాట్లాడుతు ఆశా కార్యకర్తలకు దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై అవగాహనా కల్పించారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని, మురికినీరు ఉన్న ప్రాంతాలను గుర్తించాలని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచు కోవాలని, ప్రతి ఒక్కరు దోమతెరలు వాడాలని, ఇంటి పరిసరాలలో పాత టైర్లు, కొబ్బరి చిప్పలు లేకుండా చూడాలని చెప్పారు. అనంతరం రికార్డ్స్ తనిఖీ చేసారు. డెంటల్ డాక్టర్ ఖదీర్ బాష మాట్లాడుతు నోటి శుబ్రత మాసోచ్చావాలా సందర్బంగా నోటి శుభ్రతపై అవగాహన కల్పించారు. నోరు శుభ్రంగా ఉంచుకోవడం వలన నోటి ద్వారా వచ్చే వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని ప్రతి ఒక్కరూ బ్రష్, ఫేస్ట్ తో నోరు శుభ్రపరచుకోవాలని పుల్లలతో పళ్ళు తోముకూడదని బ్రష్ వాడే విధానంపై అవగాహన కల్పించారు. వచ్చినా ప్రజలకు బ్రెష్, పేస్టు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శేఖర్ రెడ్డి, ఎంపీహెచ్ఈఓ వీరనారాయణ, సబ్ యూనిట్ ఆఫీసర్ జయరామయ్య, ఎంపి హెచ్ఈఓ శ్రీనివాసరెడ్డి, సూపర్వైజర్ ఎల్లమ్మ, ఏఎన్ఎంలు సిహెచ్ఓలు ఆశా కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలి

**వేంపల్లి: ఏప్రిల్ 08 (ప్రభాత వార్త):**



జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలని కడప జిల్లా టిడిపి కార్యదర్శి సింగారెడ్డి జయరామిరెడ్డి జిల్లా ఇంచార్జ్ మంత్రి సవిత ను కోరారు. మంగళవారం పులివెందులలో టిడిపి ఇంచార్జ్ బీటెక్ రవి, మంత్రి సవిత ఆధ్వర్యంలో శ్రీకర్ కల్యాణ మండపంలో కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె నియోజకవర్గ ప్రజలతో మమేకం అయ్యారు. సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేశారు. కడప జిల్లా టిడిపి కార్యదర్శి సింగారెడ్డి జయ రామి రెడ్డి, పులివెందుల సర్పంచ్ ల సంఘం అసోసియేషన్ తాలుకా అధ్యక్షులు బోగ్గుల భాస్కర్ రెడ్డి మంత్రి సవిత ను మర్యాద పూర్వకంగా కలిశారు. వేంపల్లి మండల అభివృద్ధి పైన , జిల్లా అభివృద్ధి పైన జిల్లా కార్యదర్శి జయరామిరెడ్డి మంత్రితో చర్చించారు. వేంపల్లెలో తాగునీటి సమస్య అధికంగా ఉందని శాస్వత పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని మంత్రి సవితను, బీటెక్ రవి ని కోరారు. అలాగే కడప జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. వేంపల్లి లో తాగునీటి సమస్య లేకుండా చూస్తామని మంత్రి తెలిపారు. అలాగే జిల్లా అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా ఇంచార్జ్ మంత్రి సవిత తెలిపారు. ఈ కార్యక్రమంలో వేంపల్లె మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పలు రికార్డులను తనిఖీ

**ముద్దనూరు, ఏప్రిల్ 08, ప్రభాతవార్త:**



పట్టణ పరిధిలో ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం నాడు జిల్లా మలేరియా అధికారి మనోరమ ఆకస్మిక తనిఖీ నిర్వహించి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం మండలంలోని శెట్టి వారి పల్లె, ముద్దనూరు, కొర్రపాడు విలేజ్ హెల్త్ సెంటర్లను పరిశీలించి మలేరియా సర్వే నిర్వహణలో వెనుకంజలో ఉండడానికి గల కారణాలను వైద్యాధికారి శ్రీకాంత్ అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ విధులలో ఎటువంటి జాప్యం లేకుండా తమకు కేటాయించిన సర్వేలను నిర్ణిత గడువు సమయంలోనే పూర్తిచేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి ప్రసాద్ యాదవ్, ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి, మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్షుమయ్య, హెల్త్ సూపర్ వైజర్ శోభా కుమారి పాల్గొన్నారు.

## కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు

**పులివెందుల,ఏప్రిల్8,ప్రభాత వార్త:**




కష్టపడి చదివితే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ఎ.నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం కళాశాల నందు వార్షి కోత్సవ మరియు వీడ్కోలు సభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కళాశాల కరస్పాండెంట్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి భవిష్య తను సుఖమయం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. డైరెక్టర్ పి.వి.సుబ్బా రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పోటీ ప్రపంచంలో నెగ్గాలని అపుడే వారు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ వై. నారాయణ రెడ్డి మాట్లాడుతూ వార్షిక నివేదికను మరియు విద్యార్థులను ఉద్దేశించి వివరించారు. అనంతరం క్రీడా పోటీలలో నెగ్గిన విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ నీరజ మరియు అధ్యాపక బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బండి రాజేష్ కుటుంబ సభ్యులకు మంత్రి పరామర్శ

**రాయచోటి, ఏప్రిల్ 8 ప్రభాతవార్త**



మంత్రి మండిపల్లి రాంప్రసాద్రెడ్డి రాయచోటి పట్టణం, జగదాం బసెంటర్లో నాలుగు రోజుల క్రితం బండి రాజేష్ మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు. ఎలాంటి అవసరం వచ్చిన తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## త్రాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోండి

**పీలేరు ఏప్రిల్ 8 ప్రభాతవార్త:**



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

వేసవి కాలం వచ్చింది. తాగునీటి ఇబ్బందులు లేకుండా అధికారులు నిత్యం నీటి పథకాలను పర్యవేక్షించాలని పీలేరు మండల అధ్యక్షుడు కంభం సతీష్ రెడ్డి అన్నారు. మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన పీలేరు మండల సర్వస్వ సమాసం జరిగింది. ఈ సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ కొందరు పంచాయతీ కార్యదర్శులు ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా తాస్కారం చేస్తున్నారని ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలని, ఇందులో రాజకీయాలు చేయొద్దని హితవు పలికారు. ఎంపీటీసీ సభ్యుడు మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ పీలేరు, కలికిరి మధ్య జాతీయ రహదారి విస్తరణతో పల్లెలకు దారులు, చెరువులకు మీరు అందించే కాలువలు దెబ్బతిన్నాయని, వాటిని సరిచేసి ప్రజలకు, రైతులకు తగిన సౌకర్యాలు కల్పించాలన్నారు. తహశీల్దారు భీమేశ్వరరావు మాట్లాడుతూ అది వాస్తవమే అని, సచివాలయాల్లో పనిచేసే సర్వేయర్లకు తగిన అనుభవం లేనందున కొన్ని తప్పులు జరిగాయని, వాటిని తప్పకుండా మళ్లీ సరి చేస్తామని భరోసా ఇచ్చారు. సమావేశంలో పీలేరు జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు షామియానా షఫీ మాట్లాడుతూ పీలేరు పంచాయతీలో పరిపాలన అస్తవ్యస్తంగా తయారైందని ఆరోపించారు. పంచాయతీ పారిశుధ్య కార్మికులకు గతంలో ఇస్తున్న వేతనాలకన్నా తక్కువ జీతాలు ఇస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని చెప్పారు. ఈ విషయంలో సమావేశంలోని ఈ.ఓ.పి.ఆర్.డి లతీఫ్ ఖాన్ దృష్టి పెట్టి అన్ని విధాలా అభివృద్ధి జరిగేలా చూడాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శివశంకర్, తహశీల్దారు భీమేశ్వర రావు, మండల వైస్ ప్రెసిడెంట్ హరిత, కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ బాష, ఎంపీటీసీ సభ్యులు నరసింహా రెడ్డి, మధుసూధన్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, ఇరిగేషన్ డిఈ సేవలా నాయక్, ఏఈలు ఇరగన్న, రామాకృష్ణ నాయక్, ఐసిడిఎస్ పర్యవేక్షకులు స్వరూప, స్వర్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్ కేంద్రం సేవలను సద్వినియోగపరచుకోండి

**ముద్దనూరు, ఏప్రిల్ 08, ప్రభాతవార్త:**

పట్టణ పరిధిలోని సచివాలయం2 కేంద్రంలో ఆధార్ కేంద్రాన్ని పునరుద్ధరించినట్లు మంగళవారం మండల అభివృద్ధి అధికారి ముకుందా రెడ్డి తెలిపారు. సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న డిజిటల్ అసిస్టెంట్ అనారోగ్య కారణాలవల్ల విధులకు హాజరు కాకపోవడంతో, ఉప్పులూరు గ్రామ సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న నాగేంద్ర కుమార్ కు ఇన్చార్జి బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు. మండల ప్రజలు గమనించి ఆధార్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

## ఆన్లైన్ మోసాలు, లావాదేవీలపై అవగాహన సదస్సు

**సుండుపల్లి, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:**




మండల పరిధిలోని మండల సమాఖ్య కార్యాలయంలో రాయలసీమ హరిజన గిరిజన మైనార్టీ వెనుకబడిన తరగతుల సంస్థ ప్రతినిధి బివి రత్నం ఆధ్వర్యంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి సహకారంతో డిపాజిటెడ్ ఎడ్యుకేటెడ్ అవేర్నెస్ ఫండ్ పై అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాల ఆనిమేటర్స్, సీఆర్పీలు పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాయలసీమ హరిజన, గిరిజన, వెనుకబడిన తరగతులు, మైనారిటీ సంస్థ ప్రతినిధి బివి రత్నం మాట్లాడుతూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు 2014 సంవత్సరంలో డిపాజిటెడ్ ఎడ్యుకేటెడ్ అవేర్నెస్ ఫండ్ ను ఏర్పాటు చేయడం జరిగింది. బీమా పథకాల గురించి ప్రధానమంత్రి బీమా సురక్ష యోజన, బీమా జ్యోతి మరియు అటల్ పెన్షన్ యోజన వంటి పథకాల గురించి కళా జాతర కళాకారులచే పాటల రూపంలో అవగాహన కల్పించడం జరిగింది. సైబర్ నేరగాళ్లు మిమ్మల్ని బెదిరించినట్లయితే 1930 టోల్ ఫ్రీ నెంబర్ కి కాల్ చేసి కంప్లీట్ చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిసి నాయక్ మరియు ఓబులేసు, సంస్థ ప్రతినిధులు ఎస్ ముబారక్, ఎం బాబు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## మా మద్దతుతోనే సర్పంచ్గా గెలిచిన కొనిరెడ్డి

**ప్రొద్దుటూరు ఏప్రిల్ 8 ప్రభాతవార్త**




కొత్తపల్లి పంచాయతీ ఎన్నికలలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మద్దతు తోనే కొనిరెడ్డి శివచంద్రా రెడ్డి గెలిచారు కానీ తనకు సర్పంచ్గా గెలిచే సొంత బలం లేదని కొత్తపల్లె పంచాయతీ నాయకులు వార్డు మెంబర్ లక్ష్మీనారాయణ రెడ్డి విమర్శించారు. మంగళవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొత్తపల్లి సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్రెడ్డిపై చేసిన విమర్శలను ఆయన ఖండించారు. కొత్తపల్లి పంచాయతీకి జరిగిన ఎన్నికలలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున 17 మంది సభ్యులు విజయం సాధించారని కానీ కొనిరెడ్డి వ్యవహార శైలితో 14 మంది సభ్యులు వ్యతిరేకించిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. వార్డు సభ్యులకు కావలసిన విధంగా అభివృద్ధిలో సహకరించి ఉంటే నిన్ను ఎందుకు విభజిస్తారని నిలదీశారు. వార్డులో స్వేచ్ఛగా ఓటర్లు పాల్గొనేలా చర్యలు తీసుకున్న రాచమల్లుపై విమర్శలు చేయడం తగదన్నారు. రాబోవు ఎనిమిది తొమ్మిది నెలల్లో తిరిగి పంచాయతీ ఎన్నికలు ఉన్నాయని అందులో ప్రజలు నిన్ను చిత్తుచిత్తుగా ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సమావేశంలో ఉపేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆషాడే కార్యక్రమం

**తొండూరు ఏప్రిల్ 8 (ప్రభాతవార్త):**



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు డాక్టర్ ఆరిపుల్లా ఆధ్వర్యంలో ఆశాడే కార్యక్రమం నిర్వహించడమైనది. ఈ కార్యక్రమంలో డాక్టర్ రేష్మా మాట్లాడుతూ ప్రమాదకరమైన గర్భవతులను త్వరితగతిన గుర్తించాలని తద్వారా త్వరగా సేవలందించి గర్భవతులకు ప్రమాదస్థితి నుండి కాపడ వచ్చునని, వారికి కావాల్సిన అన్ని సేవలు అందించిన యెడల మాతృమరణాలు, శిశు మరణాలులేకుండా చేయగలమని, వైద్య ఆరోగ్య శాఖ అందించే వైద్య సేవలు, వాహనాల ద్వారా 108. 104. 102 వాహన సేవలతో పాటు ఆర్థిక పరమైన లబ్ధి గురించి అనగా జనని సురక్ష యోజన, జనని శిశు సంరక్షణ, ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన, ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ పథకాల గురించి వివరంగా తెలియ చేసారు. ఈ సందర్బంగా ఆశాలకు యూనిఫాం, రెండు చీరలను అందచేసారు. ఈ కార్యక్రమం లో కమ్యూనిటీ ఆరోగ్య అధికారిని విజయ, హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య, సూపర్వైజర్ శశికళ ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## శిల్పారామంలో రామాయణ ఉపన్యాసం..

**కడప కార్పొరేషన్ ఏప్రిల్ 8 ప్రభాతవార్త:**

ఒంటిమిట్ట కోదండరాం స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా రెండవ రోజు హిందూ ధర్మ ప్రచార పరిషత్ వారి సహకారంతో కడప శిల్పారామంలో సామ్ సునీత కళా వేదికపై శ్రీరామ కృష్ణ బృందం వారు రామాయణం ఉపన్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శిల్పారామం పరిపాలన అధికారి కృష్ణ ప్రసాద్, ఫీల్డ్ సూపర్వైజర్ మధుసూదన్ బాబు, భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీరాములు వారికి వసంతోత్సవాలు

**రామసముద్రం ఏప్రిల్ 8 ప్రభాతవార్త**

మండలంలోని ఎర్రబోయినపల్లి, వై. కురప్పల్లి, జంగాలపల్లి గ్రామంలో శ్రీరాముని ఉత్సవాల సందర్భంగా మంగళవారం ఘనంగా వసంతం నిర్వహించారు. సీతారాముల ఉత్సవ మూర్తులను గ్రామ పురవీధుల్లో బ్యాండు వాయిద్యాలు, టపాకాయల పేలుళ్ల నడుమ ఘనంగా ఊరేగించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించారు. హాజరైన భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

## మిట్స్లో అంతర్జాతీయ వర్క్ షాపులు

**కురబలకోట ఏప్రిల్ 8 ప్రభాతవార్త**




అంగళ్ళు సమీపం లోని మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్, మదనపల్లె లోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (డేటాసైన్స్) విభాగం వారు రెండు రోజుల పాటు ఇంజినీరింగ్ మరియు పరిశోధన రంగాలలో స్థిరమైన చర్యలు మరియు నవీన ఆవిష్కరణలు (ఇన్ స్పైర్2025)" అనే అంశం పై అంతర్జాతీయ కాన్ఫరెన్స్ కమ్వర్క్షాప్ను నిర్వహించినారు. ఈ అంతర్జాతీయ సదస్సుకు ముఖ్య అతిథిగా మోలాలి నాగూరి, సీనియర్ డేటా ఇంజనీర్, గ్జిబియా, బెంగళూరు పాల్గొన్నారు. కార్యక్రమంలో మోలాలి మాట్లాడుతూ పరిశోధనలో స్థిరమైన విధానాలు, భవిష్యత్తు తరాలకు పర్యావరణ అనుకూలమైన పరిసరాల నిర్మాణంలో ఇంజినీరింగ్ పాత్రపై ప్రసంగించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామనాథన్ మాట్లాడుతూ ఈ సదస్సు యువ పరిశోధకులకు మరియు విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా ఉండడమే కాకుండా, కొత్త ఆవిష్కరణలకు వేదికగా నిలిచిందని తెలిపారు. దేశీయ మరియు అంతర్జాతీయ స్థాయిలో పలువురు ప్రముఖ విద్యావేత్తలు, పరిశోధకులు, పరిశ్రమ నిపుణులు, విభాగాధిపతి డాక్టర్ కుసుమ, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొని, స్థిరమైన పరిష్కారాల ఆవశ్యకతపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు.


## మైనర్ బాలిక మిస్సింగ్ కేసు నమోదు

**ముద్దనూరు, ఏప్రిల్ 08, ప్రభాతవార్త:**

మండలంలోని డిఎన్పల్లె గ్రామానికి చెందిన బాలిక పదో తరగతి పూర్తిచేసుకుని ఇంటి దగ్గర ఉన్న మైనర్ అమ్మాయి మంగళవారం ఉదయం కనిపించకుండా పోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గ్రామాలు మరియు బంధువుల ఆరా తీయగా ఆమె ఆచూకీ తెలియకపోవడంతో తండ్రి ఫిర్యాదు మేరకు సిఐ దస్తగిరి కేసు నమోదు చేసినట్టు తెలిపారు,

## ఎమ్మెల్యేని సన్మానించిన పంచాయతీ కార్మికులు

**పీలేరు ఏప్రిల్ 8 ప్రభాతవార్త:**



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న పంచాయతీ కార్మికులు

రాష్ట్ర పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలని, వారి వెతలను శాసనసభలో పంచాయతీరాజ్ శాఖా మంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకు వెళ్లిన పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డిని పీలేరు గ్రామపంచాయతీ కార్మికులు ఘనంగా సన్మానించి సత్కరించారు. మంగళవారం వారు కలికిరి నగిరిపల్లిలో ఎమ్మెల్యేని కలిసి కృతజ్ఞతలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ధనవాసి వెంకట్రామయ్య మాట్లాడుతూ పంచాయతీ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఎలక్ట్రీషన్, డ్రైవర్స్, వాటర్ బాయ్స్, పారిశుద్ధ కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా 25 వేల మంది కార్మికులు చాలీచాలని వేతనాలతో దుర్భర జీవితం గడుపుతున్నామని ఎమ్మెల్యే గుర్తించి శాసనసభలో ప్రస్తావించడం సంతోషంగా ఉందని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఓబులేసు, పులి రెడ్డప్ప, నాగార్జున, వైయస్ మస్తాన్, చిట్టెమ్మ, సుబ్బులక్ష్మి, రాధా రాణి, సరోజ ,సుబ్రమణ్యం, శాంతి కుమారి, రాజేశ్వరి పీలేరు పంచాయతీ కార్మికులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో వ్యక్తి మృతి

**మైదుకూరు, ఏప్రిల్ 08, ప్రభాతవార్త:**

నియోజకవర్గంలోని బ్రహ్మంగారి మఠంలోని తెలుపుంగ కాలనీకి చెందిన కుక్కు వెంకటేశ్వర్లు కుమారుడు శ్రీకాంత్ (22 సం") బ్రహ్మంగారిమఠం నుండి మిట్టమానుపల్లి మీదుగా వనిపెంట సమీపంలో మైదుకూరుకి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో గాయాలు అయ్యాయి. స్థానికులు 108కు తెలియజేయడంతో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. డాక్టర్లు సీరియస్గా ఉంది అనడంతో అక్కడినుండి కర్నూలుకి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మరణించినట్లు తెలిపారు. కొడుకు మరణించడంతో కుటుంబం శోక సముద్రంలో మునిగిపోయారు. ఇంటికి పెద్ద దిక్కు కావడం వయస్సు మీద పడి ఉన్న తల్లిదండ్రిని ఆదుకొని కుటుంబాన్ని పోషించాల్సి న కుమారుడు చనిపోవడంతో వారి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పోలీసులు విచారణ చేపట్టి వారి కుటుంబానికి న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

## పశువుల నీటి తొట్టెలు త్వరగా పూర్తి చేయండి

**తంబళ్లపల్లె ఏప్రిల్ 8 ప్రభాతవార్త ః**

వేసవి కాలంలో పశువులకు తాగునీటి కోసం ఉపాధి హామీలో మంజూరైన తాగునీటి తొట్టెల నిర్మాణపు పనులు త్వరగా పూర్తి చేయాలని ఉపాధి హామీ ఎపిడి నందకుమార్ రెడ్డి క్షేత్ర సహాయకులకు సూచించారు. మంగళవారం ఆయన ఉపాధి కూలీలతో సమీక్షించి భూగర్భ జలాల పెంపు పనులలో భాగంగా ఇంకుడు గుంతలు, పశుగ్రాసం కోసం పాడి రైతులకు సహకరించాలన్నారు. ఉపాధి హామీ పనుల నిర్వహణలో నిష్పక్షపాతంగా పనిచేయాలని క్షేత్ర సహాయకులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ అంజనప్ప, ఈసీ మహేష్, టెక్నికల్ అసిస్టెంట్లు శంకర, సుజాత, పుష్ప కుమారి, బాలగంగాధర్, భూదేవి మండలంలోని క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

## టమోటా పంట తెగుళ్ళపై బాయర్ కంపెనీ సూచనలు

**తంబళ్లపల్లె ఏప్రిల్ 8 ప్రభాతవార్త ః**

తంబళ్లపల్లె మండలంలోని టమోటా రైతులు పంటలకు సోకే తెగుళ్ల వాటి నివారణ పై అప్రమత్తంగా ఉండాలని బాయర్ కంపెనీ మార్కెటింగ్ మేనేజర్ వినయ్ కుమార్ సూచనలు చేశారు. మంగళవారం ఆర్టీసీ బస్టాండులో రైతులకు టమోటా పంటలకు సోకే తెగుళ్ళ, చీడపీడలు, సస్యరక్షణపై వీడియోతో పాటు పలు సూచనలు సలహాలు చేశారు. టమోటా తెగుళ్ల నివారణ పై ఉచిత సూచనలకు బాయర్ కంపెనీ మీకు అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బార్ కంపెనీ సూపర్వైజర్ నరసింహారావు, ఫీల్డ్ ఆఫీసర్లు జ్ఞానేశ్వర్, రమేష్ నాయక్, రైతులు పాల్గొన్నారు.



## విద్యార్థి మిత్ర స్టాక్ పాయింట్ సందర్శన.

**కలకడ ఏప్రిల్ 8 ప్రభాతవార్త :**



కిట్ గదులను పరిశీలిస్తున్న దృశ్యం

ఆదర్శ పాఠశాలలో ఏర్పాటుచేసిన సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర స్టాక్ పాయింట్ ను స్టేట్ అబ్జర్వర్ డాక్టర్ కె పెంచలయ్య సందర్శించినట్లు ఎంఈఓ 2 రామచంద్రా రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రమైన కలకడ మోడల్ స్కూల్లో ఏర్పాటు చేయబడిన విద్యార్థి మిత్ర స్టాక్ పాయింట్ ను సందర్శించి పలు సూచనలు సలహాలు ఇచ్చినట్టు తెలిపారు. విద్యార్థి మిత్ర కిట్టు నిలువుజేసే నాలుగు గదులను పరిశీలించినట్లు తెలిపారు. జూన్ 12 నాటికి ప్రతి విద్యార్థికి కిట్టు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించినట్టు తెలిపారు.కిట్ సరఫరా బాధ్యత మండలంలోని రెండవ ఎంఈఓ తీసుకోవాలని సూచించినట్టు తెలిపారు. అలాగే రూట్ మ్యాప్ లు తయారుచేసుకుని ఒక్కొక్క రూటుకు ఇన్చార్జిలను నియమించి ప్రతి పాఠశాలకు కిట్టు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఓ కోఆర్డినేటర్ వెంకటరామయ్య, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ మలంగ్ షావలి, డీటీఈవో మల్లికార్జున, సి ఆర్ పి శ్రీకాంత్, ఎం ఐ ఎస్ అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.


## బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న ఇద్దరు అరెస్ట్

**యర్రగుంట్ల ఏప్రిల్ 8 ప్రభాతవార్త**

ఎర్రగుంట్ల పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శ్రీనివాస్ మూర్తి ఎన్ టి ఎఫ్ సిఐ వారి సిబ్బంది ఆధ్వర్యంలో కమలాపురం పట్టణంలో బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 85 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నాము అని తెలిపారు.

## దళిత మోర్చా సీనియర్ నాయకునికి అభినందనలు


**బద్వేలు, ఏప్రిల్ 8, ప్రభాతవార్త**



ఎర్రగుంట్ల మార్కెట్ కమిటీ చైర్మన్గా ఎన్నికైన బిజెపి దళిత మోర్చా సీనియర్ నాయకుడు రామిరెడ్డిపల్లి నాగరాజు కు బద్వేల్ బిజెపి సీనియర్ నాయకులు కుప్పాల నరసింహులు మరియు బిజెపి అట్లూరు మాజీ మండల అధ్యక్షులు తమ్మినేని ఆంజనేయులు అభినందనలు తెలిపారు. మంగళవారం వారు ఎర్రగుంట్లలోని నాగరాజు స్వగృహం నందు ఆయనకు శాలువా కప్పి పూలదండలు వేసి అభినందనలు తెలిపారు. సీనియర్ కార్యకర్తలను గౌరవించే సంస్కృతి భారతీయ జనతా పార్టీలోనే ఉందని , క్రమశిక్షణతో పార్టీలో పని చేసే వారికి ఎప్పటికైనా సముచిత స్థానం ఇచ్చేది ఒక భారతీయ జనతా పార్టీని అని కొనియాడారు. అందులో భాగంగానే నేడు నాగరాజుకు ఈ పదవి దక్కడమని తెలిపారు. కావున ఈ ప్రాంతంలో అనేక మంది కార్యకర్తలకు భారతీయ జనతా పార్టీలో చేరి పని చేయాలని కోరారు.

## ప్రతి ఒక్కరికి సర్వే చేయాలి

**యర్రగుంట్ల ఏప్రిల్ 08 ప్రభాతవార్త**



మండల పరిధిలోని చిలమకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా మలేరియా అధికారిని మనోరమ ఆకస్మిక తనిఖీ చేశారు. ఇతనికి భాగంగా పరిశీలించి ఆరోగ్య కార్యకర్తల యాక్టివ్ సర్వే లెన్స్ ఇన్ఫు చేసి, రక్త పూతల స్లైడ్స్ ప్రతిరోజు ల్యాబ్ కు పంపాలన్నారు. పంపిన ప్రతి నమూనాను రికార్డులలో భద్రపరచాలని, అసంక్రమిత వ్యాధుల సర్వేలో హనుమాన్ క్యాన్సర్ వ్యాధులను గుర్తించాలని, వ్యాధిని గుర్తించిన ప్రతి ఒక్క కేసును రిమ్స్ వార్డుకు పంపించాలని తెలిపారు. అంతేకాకుండా 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని సర్వే చేయించాలని సిబ్బందికి సూచించారు. ఓఆర్ఎస్ కార్నర్ను పరిశీలించి వడదెబ్బ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గణేష్ కుమార్ రెడ్డి, మలేరియా యూనిట్ ఆఫీసర్ లక్ష్మయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ నాగముని రెడ్డి, సూపర్వైజర్ సుభద్ర, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 10న రాజంపేటలో ప్రత్యేక విద్యుత్ అదాలత్

**(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త)**

రాజంపేట విద్యుత్ డివిజన్ కార్యాలయం నందు గురువారం ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించబడునని ఆ శాఖ ఈ. ఈ యన్.రాజశేఖర్ రెడ్డి తెలిపినారు ఈ విద్యుత్ అదాలతో చైర్ పర్సన్ వి శ్రీనివాసు ఆంజనేయ మూర్తి, రిటైర్డ్ జడ్జి, ఆర్థిక సభ్యులు కె రామ్మోహన్ రావు, సాంకేతిక సభ్యులు ఎస్ ఎల్ అంజనీ కుమార్, స్వతంత్ర సభ్యులు డబ్ల్యు విజయలక్ష్మిలు పాల్గొంటారని, విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సమస్యల పరిష్కారం కొరకు హాజరు కాగలరని తెలిపినారు.

## నేడు అన్నమాచార్యలో టెక్ ఫెస్ట్ 2025

**(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త)**

యూనివర్సిటీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో బుధ గురువారాలు రెండు రోజుల సాంకేతిక సాంస్కృతిక మహోత్సవమైన టెక్ ఫెస్ట్ -2025 ను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని అన్నమాచార్య యూనివర్శిటీ వైస్చాన్సలర్ ఈ. సాయిబాబా రెడ్డి విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు సాంకేతికత, సాంస్కృతికత పట్ల ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరినీ ఈ మహోత్సవానికి హాజరుకావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు క్యూఆర్ కోడ్ను స్కాన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

